క్లుప్తంగా

వంట సామగ్రి అందజేత



శావల్యాపురం: మండలంలోని 39 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన వంట సామగ్రి (కిట్లు) ప్రభుత్వం ఉచితంగా మంజూరు చేసినట్లు మండల విద్యాశాఖాధికారి మద్దికుంట సాంబశివరావు సోమవారం తెలిపారు. ఈసందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల సంఖ్య ఆధారంగా మధ్యాహ్న భోజన పథకానికి వంట పాత్రలు అందజేసినట్లు చెప్పారు. అనంతరం శావల్యాపురం ఎంపీపీ స్కూలు ప్రధానోపాధ్యాయులకు వంట సామగ్రి కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో పుసులూరి లలితాకుమారి, సీఆర్పీలు రావూరి శివప్రసాదు, శ్రీహరి, తివిక్రమ్ ఉన్నారు.

28న స్కూల్ గేమ్స్

నాదెండ్ల: చిలకలూరిపేట నియోజకవర్గస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆటల పోటీలు సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈ నెల 28న నిర్వహించనున్నట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అంజమ్మ, హెచ్ఎం వి.వెంకటరావు తెలిపారు. అథ్లెటిక్స్‌తో పాటూ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, టెన్నికాయిట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 14, 17 ఏళ్లలోపు బాలబాలికలకు విడివిడిగా పోటీలు జరుగుతాయన్నారు. ఎంపిక కాబడిన క్రీడాకారులు తమ ఎంట్రీ ఫారాలతో సాతులూరులో జరిగే పోటీల్లో పాల్గొనాలన్నారు. అథ్లెటిక్స్ ఉదయం 8.30 గంటలకే ప్రారంభమౌతాయని తెలిపారు. ఈ నెల 18న జరగాల్సిన పోటీలు వర్షాల కారణంగా వాయిదా పడినట్లు తెలిపారు.


వ్యక్తిపై దాడి

నరసరావుపేట టౌన్: వ్యక్తిపై దాడికి పాల్పడ్డ ఆరుగురు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ వీరేంద్ర బాబు సోమవారం తెలిపారు. పట్టణానికి చెందిన అశోక్ సత్తెనపల్లి రోడ్డు అయ్యప్ప స్వామి గుడి వద్ద ఆదివారం రాత్రి నిల్చొని ఉండగా పాతూరు ప్రాంతానికి చెందిన నాని, సాంబ, బీసీ కాలనీకి చెందిన రమేష్ తో పాటు మరో ముగ్గురు మద్యం సేవించి వచ్చి అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గాయపడ్డ వృద్ధుడు మృతి

యడ్లపాడు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మైదవోలు గ్రామానికి చెందిన దావల నరసయ్య, ఏసమ్మ దంపతులు కొద్దికాలంగా యడ్లపాడు గ్రామంలోని తమ రెండో కుమారుడు ఇంటి సమీపంలో నివాసం ఉంటున్నారు. ఈ నేపథ్యంలో నరసయ్య ఈనెల 11వ తేదీన తన వ్యక్తిగత పనుల నిమిత్తం ప్రత్తిపాడు గ్రామానికి టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్‌పై ప్రయాణమయ్యాడు. మండలంలోని ఉన్నవ గ్రామం శివారులో వాహనం అదుపు తప్పడంతో కిందపడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రత్తిపాటి గ్రామంలోని గ్రామీణ వైద్యుడి వద్ద ప్రాథమిక చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో గుంటూరు సమగ్ర ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం నరసయ్య (70) మృతి చెందాడు. కుమారుడు దావల ప్రసన్నకుమార్ ఫిర్యాదుతో యడ్లపాడు ఎస్ఐ కేసు నమోదు చేసుకున్నారు.

బీమా నగదు అందజేత



నరసరావుపేట: స్థానిక ఐదో వార్డు క్రిస్టియన్ పాలెంలో అకస్మాత్తుగా మృతిచెందిన గోన అనీల్‌కుమార్ కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం సోమవారం రూ.10 వేలు అందజేశారు. అతడి కుటుంబానికి ఆ పథకం కింద రూ.1 లక్ష మంజూరైందని మాదిగ సంక్షేమ కార్పొరేషన్ డైరక్టర్ కందుల ఎజ్రా తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆదేశాల మేరకు మట్టి ఖర్చులకు వెంటనే నగదు అందజేయటం జరిగిందన్నారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ మెంబర్ మల్లెల అశోక్, సచివాలయం సెక్రటరీ షేక్ సుభాని, వలంటీర్ స్వర్ణ గ్రేస్, వార్డు ప్రెసిడెంట్ కుక్కల పాలు, శిఖ రుక్మిణి, శిఖ కోటి పాల్గొన్నారు.

ఎస్పీ బాలుకు ఘన నివాళి

నరసరావుపేట ఈస్ట్: సినీ గాయకుడు ఎస్పి బాలసుబ్రమణ్యం 3వ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని కళాకారులు ఘనంగా నివాళులర్పించారు. పల్నాడు రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన పల్నాడు కళాక్షేత్రంలో బాలసుబ్రమణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణానికి చెందిన గాయకులు కొఠారి రంజిత్‌కుమార్, బి.సుశీల్‌కుమార్, పి.రవికుమార్, ఇ.చంద్ర శేఖర్, ఓగూరి నాగేశ్వరరావు, స్వరసుధ సుధాకర్‌లు ఎస్పీ ఆలపించిన పాటలను ఆలపించి రంజింపచేశారు. కార్యక్రమంలో పొన్నపాటి ఈశ్వరరెడ్డి, ఎస్.ఎం.భాషా, చేగు వెంకటేశ్వరరావు, డప్పు శ్రీను, డాక్టర్ చదలవాడ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు. భువనచంద్ర టౌన్‌హాల్‌లోని బాలు విగ్రహానికి రంగస్థల కళాకారులు నివాళులర్పించారు.

జగనన్నా.. ధన్యవాదాలన్నా..

- వినుకొండ అభివృద్ధిలో మీ సహకారం అపూర్వం
- అసెంబ్లీలో అభివృద్ధి పనులపై మాట్లాడిన ఎమ్మెల్యే బొల్లా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో వినుకొండ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు నియోజకవర్గంలోని పలు అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బొల్లాపల్లి మండలంలో కొన్ని గ్రామాలు భూగర్భ జలాలు అడుగంటిన జాబితాలో ఉండి సరైన నీటి సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి బొల్లాపల్లి చెరువు ఆధునీకరణ చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. చెరువు ఆధునీకరణకు, ఆ చెరువు నుంచి నీటిని సరఫరా చేయాల్సిన గ్రామాలకు పైపు లైన్‌లు వేయడానికి అవసరమైన అటవీ అనుమతులు చివరి దశలో ఉన్నాయని, అనుమతులు త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి అన్ని అనుమతులు వచ్చాయని, ఈ ఆస్పత్రికి త్వరలోనే శంకుస్థాపన చేయబోతున్నామని వివరించారు. అదేవిధంగా ముస్లిం గురుకుల పాఠశాల, కళాశాలకు సంబంధించిన అన్ని అనుమతులను త్వరగా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రులను అసెంబ్లీ సాక్షిగా ఆయన కోరారు.

బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు పలువురు ఎంపిక



శావల్యాపురంలో ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు



వినుకొండలో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

శావల్యాపురం: ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో రాణించటం అభినందనీయమని జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల్లో రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎంపికైన విద్యార్థులను అభినందించే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు శావల్యాపురం హైస్కూలు నుంచి ఎక్కువ మంది విద్యార్థినులు ఎంపిక కావటం చాలా సంతోషంగా ఉందని, ఉత్తమప్రతిభ చూపించి రాష్ట్రస్థాయి పోటీల్లో ఎంపిక కావాలన్నారు. ఈ నెల 24న ఎన్‌జీహోం క్రీడా మైదానం జరిగిన బాల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీల్లో ఉమ్మడి గుంటూరు జిల్లాల తరుపున జూనియర్స్ అండర్–16 విభాగంలో ఎంపిక పోటీలు జరిగాయన్నారు. ఈటోర్నమెంటులో ఏడుగురు బాలికలు విన్నర్స్‌గా విజయం సాధించగా వేముల దివ్య (10వ తరగతి) యు.బసవరాణి, యం.లూథియా, బి.దేవమణి, ఓర్సు స్రవంతి, ఇంటరు మొదట సంవత్సరం బాలికలు ఆకుమళ్ళ సమీరా, కె. కావ్యలు పోటీల్లో అర్హత సాధించినట్లు తెలిపారు. బాలికల జట్టు ఈనెల 30 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నంద్యాల జిల్లా మహానందిలో జరిగే 8వరాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీ రాగుల రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఈ ఎంపికలు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ కార్యదర్శి ఈ.శివశంకర్, అధ్యక్షులు డి.ఆనంద ప్రభాకర్‌లు నిర్వహించారన్నారు. పోటీలకు ఎంపికైన విద్యార్థినులను ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, పీడీ రాధాకృష్ణమూర్తి, భువనేశ్వరి, నిర్మల, హనుమారెడ్డి, గురుబాబు, శ్రీనివాసరావు, సుభాష్ చంద్రా రెడ్డి, అబ్దుల్లా, రవి శ్రీకాంత్ అభినందనలు తెలిపారు.

నిర్మలా విద్యార్థుల ప్రతిభ

వినుకొండ(నూజెండ్ల): గుంటూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్ జూనియర్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్‌లో పట్టణంలోని నిర్మలా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో విజయం సాధించారని పాఠశాల కరస్పాండెంట్ డేనిస్ సుప్రియ తెలిపారు. పాఠశాలకు చెందిన సాయికుమార్, రోహిత్, షాకీర్ బాషా, జగదభిరామ్‌లు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. నంద్యాల జిల్లాలో ఈ నెల 30వ తేదీ నుంచి జరిగే పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు తెలిపారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను సిస్టర్ క్యాస్పర్, హెచ్ఎం సిస్టర్ రాణి, సిస్టర్ చిన్ని, అసోసియేషన్ సెక్రటరీ శంకర్రావు, కోచ్ జోనానాయక్, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్, అశోక్, వంశీ తదితరులు అభినందించారు.

ఆసరాగా ఉంటాడనుకుంటే..

- అనంత లోకాలకు వెళ్లిపోయాడు
- కుమారుడి మృతితో వ్యవసాయ కూలీ ఇంట విషాదం



చిన్నం పాల్‌రాజు (ఫైల్)



విలపిస్తున్న కుటుంబ సభ్యులు

నాదెండ్ల: చదువు పూర్తయ్యాక కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు దుర్మరణం పాలవటంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగారు. మండలంలోని ఇర్లపాడు గ్రామంలో విషాద సంఘటన చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన చిన్నం రాజబాబు దంపతులు వ్యవసాయ కూలి పనులు చేసుకుని జీవిస్తుంటారు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు కాగా, కుమార్తెకు వివాహమైంది. కుమారుడు చిన్నం పాల్‌రాజు (20) ఐటీఐ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలో ఉన్నాడు. ఈ క్రమంలో తనకు వరుసకు సోదరుడైన మరియబాబుకు ఈ నెల 28న వివాహం కావటంతో నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు ద్విచక్రవాహనంపై నరసరావుపేట వెళ్ళి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో చిలకలూరిపేట రోడ్డులోని రిలయన్స్ పెట్రోల్ బంకు వద్దకు వచ్చే సరికి ఆర్టీసీ బస్సు ఢీకొంది.

దీంతో చిన్నం పాల్‌రాజు అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. యువకుడి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. చేతికంది వచ్చిన కొడుకు మృత్యువాతపడటంతో తల్లిదండ్రుల రోదన అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

అమ్మవారికి రూ.5.27 లక్షల ఆదాయం



నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలో వేంచేసియున్న శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానానికి రూ.5,27,992లు ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ టి.సుధాకర రెడ్డి తెలిపారు. ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. ఆలయ హుండీల ద్వారా రూ.4,84,065లు, అన్నదాన హుండీ ద్వారా రూ.43,927లు లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపు పర్యవేక్షులుగా ఈఓలు కె.మంజూష, బండి శ్రీనివాసరావులు వ్యవహరించారు. ఆలయ కమిటీ మాజీ సభ్యులు వంకా శ్రీనివాసరెడ్డి, ఏలూరి అశోక్‌బాబు, ములకలూరు చైతన్య గోదావరి బ్యాంక్ సిబ్బంది, సేవా మండలి సభ్యులు పాల్గొన్నారు.

నేవీ మారథాన్‌లో సత్తాచాటిన వినుకొండ క్రీడాకారుడు



షేక్ అబ్దుల్లా

వినుకొండ(నూజెండ్ల): పట్టణానికి చెందిన క్రీడాకారుడు షేక్ అబ్దుల్లా విశాఖపట్నంలోని ఆర్కే బీచ్‌లో ఆదివారం జరిగిన కిస్లే వైజాగ్ నేవీ మారథాన్ పోటీల్లో ప్రతిభ కనపరిచినట్లు తెలిపారు. 21 కిలోమీటర్ ఆఫ్ మారథాన్‌ను 1.30గంటల్లో లక్ష్యాన్ని పూర్తి చేసి పాటిస్పేట్ మెడల్ సాధించినట్లు అబ్దుల్లా తెలిపారు. 2024 ఏప్రిల్ 21న ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాల నుండి క్రీడాకారులు పాల్గొనబోయే టీసీఎస్ లండన్ మారథాన్‌లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా అబ్దుల్లాను పట్టణ ప్రముఖులు తదితరులు అభినందించారు.

విప్పర్లపల్లిలో స్వచ్ఛతా ర్యాలీ



విప్పర్లపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

రొంపిచర్ల: మండలంలో విప్పర్లపల్లి గ్రామంలో సోమవారం స్వచ్ఛతాహి భారత్ అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో అన్ని వీధులలో ర్యాలీ నిర్వహించి గ్రామస్తులకు పరిశుభ్రత గురించి అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ గాదె రామిరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈనెల 15 నుండి అక్టోబర్ నెల 2 వరకు మహాత్మా గాంధీ జయంతి రోజు వరకు స్వచ్ఛతాహి భారత్ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. గ్రామస్తులు తమ ఇళ్ళతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత తోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దీనివలన సీజనల్ వ్యాధులు రాకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు, ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్. బి.మండల కో–ఆర్డినేటర్ మేడికొండ సుబ్బారెడ్డి, ఉపా ధ్యాయులు సరికొండ కొండమరాజు, గ్రామ కార్యదర్శి ఫిరోజ్, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నియోజకవర్గస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ నాగేశ్వరరావు

నరసరావుపేట రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఇండియా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు, ఎంపికలు సోమవారం లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించారు. పోటీలను మండల విద్యాశాఖాధికారి నాగేశ్వరరావు ప్రారంభించారు. నరసరావుపేట, రొంపిచర్ల మండలాల నుంచి అండర్–14,17 విభాగాల్లో నిర్వహించిన పోటీలకు 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–17, అండర్–14 బాలుర, అండర్–17 బాలికల ఖో–ఖో పోటీలలో నరసరావుపేట జట్టు, అండర్–14 బాలికల విభాగం ఖో–ఖో పోటీలలో రొంపిచర్ల జట్టు విజేతగా నిలిచాయి. అండర్–17 బాలుర కబడ్డీలో నరసరావుపేట, అండర్–17 బాలికల కబడ్డీలో రొంపిచర్ల జట్టు, అండర్–14 బాలుర కబడ్డీలో నరసరావుపేట, అండర్–14 బాలికల కబడ్డీలో రొంపిచర్ల జట్లు విజయం సాధించాయి. అండర్–17,14 బాలికల టెన్నికాయిట్‌లో నరసరావుపేట జట్లు, అండర్–17 బాల, బాలికల వాలీబాల్ పోటీలో నరసరావుపేట, అండర్–14 బాలుర విభాగంలో నరసరావుపేట, అండర్–14బాలికల విభాగంలో రొంపిచర్ల, అండర్–17 త్రోబాల్‌లో నరసరావుపేట, అండర్–14 బాలికల విభాగంలో రొంపిచర్ల జట్లు విజయం సాధించాయి. పోటీలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి సిహెచ్ కోటేశ్వరరావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ జి.ఝాన్సీరాణిలు పర్యవేక్షించారు.

1న జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలి

ఏపీ వీఆర్వో సంఘం డిప్యూటీ జనరల్ సెక్రెటరీ కేపీ చారి

యడ్లపాడు: ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోషియేషన్ 17వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అక్టోబర్‌లో నిర్వహిస్తున్నట్లు మండలానికి చెందిన ఏపీ వీఆర్వోల సంఘం డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేపీ చారి తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రతి మూడేళ్లకోసారి నిర్వహించుకోవాల్సిన ఈ కౌన్సిల్ సమావేశం 2020లో కోవిడ్ కారణంగా వాయిదా పడిందన్నారు. కాబట్టి ఆరేళ్లకు (2017–2023) కలిపి అక్టోబర్ ఒకటో తేదీన ఘనంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టామన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి రెవెన్యూ వ్యవస్థలోని అన్ని విభాగాల ఉద్యోగులు విధిగా హాజరు కానున్నట్లు వెల్లడించారు. వీఆర్ఏ, వీఆర్వో, సీసీఎల్ఏలపాటు రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి సైతం ఇదే వేదికపై చేరడంతో కార్యక్రమం పర్వదినంగా మారుతుందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఈనెల 30 అలాగే అక్టోబర్ 1,2 తేదీల్లో ఎలాంటి తమ శాఖాపరంగా ఎలాంటి టెలీ, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహణ లేకుండా మినహాయింపు ఇవ్వాలని జిల్లా కలెక్టర్లను ముందస్తుగానే కోరినట్లు వివరించారు. కాబట్టి వివిధ విభాగాల రెవెన్యూ ఉద్యోగులందరూ విధిగా హాజరై ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కలెక్టర్‌కు కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి హరిబాబు వినతి

నరసరావుపేట: పల్నాడు జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి కౌలు రైతులు, వ్యవసాయ కూలీలను ఆదుకోవాలని కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు కోరారు. ఈ మేరకు సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. విలేకరులతో మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో 2023–24 ఏడాదికి సంబంధించి ఖరీఫ్‌లో 5.50 లక్షల ఎకరాలు సాగు కావల్సి ఉండగా మూడు లక్షల ఎకరాలలో మాత్రమే వివిధ రకాల పంటలు సాగు అయ్యాయన్నారు. ప్రధానంగా ఖరీఫ్‌లో పత్తి, అపరాల పంటలు వర్షాభావ పరిస్థితుల్లో సరైన ఎదుగుదల లేక ఆశాజనకంగా లేని పరిస్థితి నెలకొందన్నారు. కౌలు రైతులు ముందుగానే కౌలు చెల్లించి ఏ పంటవేయాలో అర్థం కాక అయమయంలో ఉన్నారన్నారు. వరి సాగుకు నీరు ఇవ్వలేమని నీటిపారుదలశాఖ మంత్రి ప్రకటించిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారులు రబీలో మొక్కజొన్న, జొన్న, అపరాల సాగుకు ఆరుతడుల కింద ఇష్టమన్న నీటి విడుదలపై స్పష్టమైన ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు. బ్యాంకులలో రైతులు తీసుకున్న వ్యవసాయ రుణాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత మూడు నెలల నుంచి వ్యవసాయ పనులు లేక వ్యవసాయ కూలీలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కరువు పెన్షన్ మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు కామినేని రామారావు, మండల కార్యదర్శి కోండ్రు ఆంజనేయులు, సంఘం నాయకులు పాల్గొన్నారు.

గణనాథుడికి ఎమ్మెల్యే గోపిరెడ్డి పూజలు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డిని సత్కరిస్తున్న నిర్వాహకులు

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో ఆదివారం రాత్రి నరసరావుపేట శాసన సభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పర్యటించారు. గ్రామానికి విచ్చేసిన ఆయనకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో ఎస్.బీ.ఐ వద్ద ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడ అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కురుగుంట శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు గెల్లి బ్రహ్మారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, కల్లి సుబ్బారెడ్డి, వెంకట రెడ్డి, అన్నెం పున్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయండి

ఎంపీడీవో సీతారామయ్య



మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమయ్యేలా అన్నీ శాఖల అధికారుల సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై గ్రామసచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామ సచివాలయాలు ఉండగా శావల్యాపురం గ్రామ సచివాలయం మినహా అన్నీ సచివాలయాల పరిధిలో గతంలో ప్రకటించిన విధంగా తేదీల వారీగా సచివాలయాల పరిధిలో ప్రత్యేకంగా వైద్య నిపుణుల సారథ్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఇందుకు గాను వలంటీర్లు ఇంటింటి సర్వే ప్రక్రియ పురోగతి వేగవంతం చేయాలన్నారు. ఈనెల 30న మండలంలోని కనమర్లపూడి గ్రామ సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై దండోరా, కరపత్రాల పంపిణీ చేసి ప్రజల్లో చైతన్యం పెంపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు షేక్ జాన్ సైదులు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పశువైద్యాధికారి పాలపర్తి గణేష్ కుమార్, ఎంఈవోలు సాంబశివరావు, లలిత కుమారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే పరమావధి

యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాస రెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చిలకలూరిపేట: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే పరమావధిగా యూటీఎఫ్ పని చేస్తోందని ఆ సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు కె.శ్రీనివాసరెడ్డి చెప్పారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్‌ను పట్టణంలోని సంఘ కార్యాలయం వద్ద సోమవారం సంఘ నాయకులతో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఈ నెల 27వ తేదీన సాయంత్రం చిలకలూరిపేట పట్టణంలోని స్వర్ణోత్సవ మోటార్ బైక్‌జాత ప్రవేశిస్తుందని చెప్పారు. సంఘం ఏర్పడిన 50 ఏళ్లలో రీ గ్రూపింగ్ స్కేల్స్, ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీం, మున్సిపల్ టీచర్లకు 010 పద్దు ద్వారా జీతాలు, అప్రెంటిస్ విధానం రద్దు వంటి అనేక హక్కులు సాధించిందని చెప్పారు. స్వర్ణోత్సవాల ప్రారంభ సభ అక్టోబర్ ఒకటో తేదీన విజయవాడ సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరుగుతుందని, ఈ సభకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా కార్యదర్శి కె.తిరుపతి స్వామి, నాయకులు షేక్ రబ్బాని, మొహమ్మద్ యాసిన్, వి.నాగమల్లేశ్వరరావు, ఏసన్ననాయక్, టి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద బీమాతో ఎంతో ప్రయోజనం

మృతుడి తల్లికి రూ.20 లక్షల బీమా చెక్కు అందజేసిన ఎస్‌బీఐ అధికారులు



మృతుడి తల్లికి బీమా చెక్కు అందజేస్తున్న బ్యాంకు అధికారులు

నరసరావుపేట: ప్రమాద బీమా కుటుంబాలకు ఎంతో ఆర్థిక ప్రయోజనం చేకూర్చుతుందని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కె.ధర్మారావు పేర్కొన్నారు. గత ఆర్నెల్లు క్రితం నరసరావుపేట పట్టణానికి చెందిన షేక్ చిన్నమీరావాలి రైలు ప్రమాదంలో దుర్మరణం చెందారు. అతనికి నామినీగా ఉన్న తల్లి సుగుణబికి ఇన్సూరెన్స్ పాలసీ కింద రూ.20 లక్షల ప్రమాద బీమా చెక్కును సోమవారం బ్యాంక్ ఆవరణలో బ్యాంక్ రీజనల్ మేనేజర్ డి.రామకుమార్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మృతుడు కేవలం రూ.1000 ఇన్సూరెన్స్ చేయడం వల్లనే ప్రమాద బీమా కింద రూ.20 లక్షల రూపాయలు చెల్లించటం జరిగిందన్నారు. మృతుడి కుటుంబ అవసరాలకు ఈ సొమ్ము ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రమాద బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల ఆర్థిక పరిపుష్టికి ప్రాధాన్యత

బొల్లాపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. పంచాయతీలు ఆర్థికంగా శాశ్వత ఆస్తుల సాధన, సుస్థిర అభివృద్ధి ప్రణాళిక వంటి అంశాలపై ఈ శిక్షణలో వివరించారు. సుస్థిర అభివృద్ధి ప్రణాళికలో భాగంగా 9 అంశాలలో ప్రతి ఏటా ఏదో ఒక అంశంపై పంచాయతీలు తీర్మానంలో పొందుపరిచి అమలు చేయాలన్నారు. గ్రామాల్లో త్రాగటానికి పుష్కలంగా మంచినీరు, పచ్చదనం పరిశుభ్రత, పేదరిక నిర్మూలనలో గ్రామాలు తదితర మరో ఆరు అంశాలపై సుస్థిర అభివృద్ధి బాటలో పంచాయతీలు నడవాలని శిక్షణలో వివరించారు. ఈ శిక్షణ ఐటీసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఐటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే ప్రాంతాలు

చిలకలూరిపేట: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పట్టణంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ ఆర్ అశోక్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని మద్దినగర్, గుర్రాలచావిడి, పోలీస్ స్టేషన్ రోడ్, శారదా హైస్కూల్ రోడ్, సీఆర్ కాలనీతో పాటు మండలంలోని గ్రామీణ పరిశ్రమలకు విద్యుత్ సరఫరా సంబంధిత వేళల్లో ఉండదన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

నాదెండ్ల: ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వ్యవసాయాధికారి హరిప్రసాద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన నాదెండ్ల గ్రామంలోని మ్యాక్స్ కోఆపరేటివ్ సొసైటీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. సొసైటీలో ఉన్న ఎరువుల నిల్వలను రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయాలు చేపట్టాలని, ధరల పట్టిక షాపు ముందు ప్రదర్శించాలన్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువుల వివరాలు, ధరలను బిల్లు రూపంలో రైతులకు అందించాలన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింట్ అయిన ఒడుగు వెంకటస్వామి గారి కుమారుడు నాగుర్‌బాబు నివాసం నిమ్మతోట నర్సరావుపేట టౌన్ పల్నాడు జిల్లా అను వారి నుండి సమాచారం పొంది యావన్మందికి ఈ క్రింది విధంగా తెలియజేయడమైనది.

నర్సరావుపేట సబ్‌డివిజన్‌లోని శ్రీ ఒడుగు శ్రీరాములు గారి కుమారుడు వెంకటస్వామి అను వారి వలన తన సొంత భూమి అయిన (దస్తావేజు నెం.8709/2002) బిల్ కాంట్రాక్ట్ క్రింద 10 లక్షలకు ది.4.6.2020న విక్రయం పొందియున్నాను. సదరు ఒడుగు వెంకటస్వామికి ఎన్నిమార్లు వచ్చి తనవంతు బాధ్యత నిర్వహించవలసినదిగా మరియు రిజిస్ట్రేషన్ చేయుటకు కోరినను ఏదోవిధంగా కాలయాపన చేయుచున్నందున ఈ దిగువ షెడ్యూలు భూమిని మా క్లయింటుకు మాత్రమే విక్రయించినందున సదరు ఒడుగు వెంకటస్వామి చేయు అక్రమ చర్యలు చట్టప్రకారం చెల్లవని సదరు భూమిని ఎవరైనా కొనుగోలు మరియు తాకట్టు చేసుకున్నయెడల అట్టివారిపై చట్టప్రకారం చర్యలు తీసుకొనబడును. ఇందు మూలముగా హెచ్చరించడమైనది.

షెడ్యూలు: నర్సరావుపేట మున్సిపల్ పాత వార్డు 2 కొత్తవార్డు 20, పాత సర్వేనెం. డి.నెం. 137/2, య 0.44 సెంట్లు కొత్త సర్వే నెం.18/2, 0.24 సెంట్లు వెరశి 0.68 సెంట్లలో టి.యస్.నెం. 17/2 రు బ్లాక్ 2/1 రులో య. 0.11 ట్లు లో ఆస్తి కలదు. తూర్పు: ఘంటా మస్తాన్ తాలుకా స్థలం జాయింట్ గోడ అ79లు, దక్షిణం: గుంటూరు వెళ్ళు రోడ్డు అ 18.6, పడమర: బొద్దూరి సుబ్రహ్మణ్యేశ్వరరావు స్థలం అ 79లు, ఉత్తరం: రాఘవరావు–రామారావు గారి స్థలం అ.18.6లు.ఈ హద్దులలో గల 162.38 చ.గ. లేక 136.40 చ.మీ స్థలముయున్నూ అందలి సమస్త హక్కులను సీకు ఈరోజునే విక్రయించి స్వాధీనపరచుబడినది.

M.B.NAIK, అడ్వకేట్
సెల్: 8297552488